క్లుప్తంగా

స్విమ్స్‌కు రూ. లక్ష విరాళం



డైరెక్టర్ చెక్ అందిస్తున్న దాత

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలో అమలు చేస్తున్న శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తిరుపతి నగరానికి చెందిన వి.రజనీకుమారి, ప్రసాద్ దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. శనివారం ఈ మేరకు తన సోదరి స్విమ్స్ ఉద్యోగి సూపరింటెండెంట్ ధనక్ష్మి చేతుల మీదుగా డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్‌కు చెక్ అందజేశారు.

వాజపేయికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నేతలు

తిరుపతి గాంధీ రోడ్ : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతిని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజపేయి చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నేతలు గుండాల గోపీనాథ్ రెడ్డి, భవాని శంకర్, నరేష్, కాయం హరి, నాగోతు హరి, పెనుబాల చంద్రశేఖర్, దస్తగిరి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందన



పురస్కార గ్రహీతలతో డైరెక్టర్

తిరుపతి తుడా : ఉత్తమ సేవలందించిన స్విమ్స్ ఆస్పత్రి వైద్య సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ అవార్డులు అందించారు. శనివారం ఈ మేరకు అవార్డు గ్రహీతలు అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ అలోక్ సుమంత్‌రే, ప్రజాసంబంధాల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ వి.రాజశేఖర్, అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.సతీష్‌ను స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ అభినందించారు.

ఘనంగా గ్రామోత్సవ క్రీడలు



వాలీబాల్ ఆడుతున్న మహిళలు

తిరుపతి సిటీ : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా 17వ గ్రామోత్సవ క్రీడా పోటీలు నిర్వహించారు. ఎస్వీయూలో ఏర్పాటు చేసిన ఈ పోటీలకు జిల్లాలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, అధికారులు ఈ పోటీలను తిలకించి క్రీడాకారులను అభినందించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం విద్యుద్దీపాల నడుమ వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం దేవదేవేరులను తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆలయ మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాయితీపై పశు దాణా పంపిణీ



దాణా అందుకున్న పాడి రైతులు

చంద్రగిరి : మండలంలోని బి.కొంగరవారిపల్లెలో పాడి రైతులకు శనివారం రాయితీపై పశు దాణా పంపిణీ చేశారు. నారావారిపల్లె పశు వైద్యాధికారి సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎద క్రమబద్ధీకరణ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద రైతు తన వాటాగా రూ. 400 చెల్లిస్తే, రూ.1,100 విలువైన వివిధ రకాల ఇన్‌పుట్‌లు అందిస్తామని వెల్లడించారు.

ఆధ్యాత్మిక వైభవం..

ఆడికృత్తిక మహోత్సవం

ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని మురుగన్ సేవకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పద్మగిరిపై వెలసిన దండాయుధపాణిని దర్శించుకునేందుకు పోటెత్తారు. ఆనందగిరిపై కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధికి కావళ్లతో చేరుకున్నారు. పార్వతీతనయుడిని వైభవాన్ని వీక్షించి పరవశించారు. విశేష పూజల్లో భాగస్వాములై పులకించారు. ఈ క్రమంలోనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



కపిలేశ్వరాలయంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



పాకాలలో స్వామి వారి కల్యాణోత్సవం

- పద్మగిరి.. ఆనందగిరికి పోటెత్తిన భక్తులు
- పెద్దసంఖ్యలో కావళ్ల సమర్పణ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ సభ్యులు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తనపల్లె వద్ద పద్మగిరి కొండపై కొలువైన శ్రీబాలజ్ఞాన దండాయుధపాణి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆడికృత్తిక మహోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 6గంటల నుంచి నిర్విరామంగా భక్తులు కొండకు చేరుకున్నారు. కావళ్లతో వచ్చిన భక్తులకు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేసి త్వరితగతిన దర్శనం కల్పించేలా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. నాలుగు క్యూల ద్వారా సామాన్య భక్తులకు సైతం శీఘ్ర దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు విజయసింహారెడ్డి, బాల చంద్రారెడ్డి, హేమంత్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు.

కొండపైకి ఉచిత రవాణా

పద్మగిరిపై భక్తులకు సరిపడినంత స్థలం లేకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు కొండ కిందనే వాహనాలను నిలుపుదల చేయించారు. అయితే వృద్ధులు, మహిళలు, చంటిబిడ్డల తల్లులు, పిల్లల సౌకర్యార్థం ఉదయం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా జీపులను తిప్పుతూ ఉచితంగా రవాణా చేయించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో అర్చన, హారతులను రద్దు చేసి అందరికీ సర్వదర్శనం కల్పించారు.

కపిలేశ్వరాలయంలో..

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ఆడికృత్తికను అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం వైభవంగా తిరువీధి ఉత్సవం వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.



మోహిత్‌రెడ్డికి ఆశీర్వచనం ఇస్తున్న ప్రధాన అర్చకుడు షణ్ముఖ శర్మ



స్వామివారి దర్శనానికి క్యూలో వేచియున్న భక్తులు



పద్మగిరికి తరలివెళుతున్న భక్తులు



పుష్పపల్లకిపై స్వామివారు

కనులపండువగా కల్యాణోత్సవం

పాకాల : పాళ్యం కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కనుల పండువగా కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, పుష్ప పల్లకి సేవ నిర్వహించారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సంప్రదాయం ప్రకరం స్వామి, అమ్మవార్లకు సారె సమర్పించారు. కల్యాణోత్సవానికి ఉభయకర్తలుగా సుబ్రమణ్యంరెడ్డి, రమాదేవి వ్యవహరించారు. ఉప్పరపల్లి సర్పంచ్ గౌరీశంకర్‌రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రాత్రి స్వామివారికి పుష్పపల్లికి సేవ నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సోంపల్లి చంద్రశేఖర్‌నాయుడు, ఈఓ యువరాణి పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మెగా ఉచిత వైద్యశిబిరం.
- శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఇస్కాన్ మందిరంలో ఇస్కాన్ వ్యవస్థాపకుడు భక్తి వేదాంత స్వామి ప్రభు 129వ ఆవిర్భావ దినోత్సవం, 11 గంటలకు మహా శంఖాభిషేకం, 12 గంటలకు శ్రీలప్రభుపాద జీవితం, మహత్యంపై ఉపన్యాసం.
- రాయల్ బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీరోడ్డులోని ఏజీకే బిల్డింగ్‌లో ఉదయం 8 గంటల నుంచి పద్మావతి వివాహ పరిచయ వేదిక.

‘ట్రాన్స్‌జెండర్ ట్రూ స్టోరీ’ ఆవిష్కరణ



పుస్తకావిష్కణలో ట్రాన్స్‌జెండర్లు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : కత్తిమండ ప్రతాప్ రచించిన ట్రాన్స్‌జెండర్ ట్రూ స్టోరీ (అతడు-ఆమె) పుస్తకాన్ని ట్రాన్స్‌జెండర్ల చేతులమీదుగానే శనివారం ఆవిష్కరించారు. ట్రాన్స్‌జెండర్ల ఆవేదనను కళ్ల కట్టేలా రచయిత ఆవిష్కరించారని కొనియాడారు. హాసిని మాలిక్, చల్లగొల్ల హేమా నవీన్, నందిని, సుప్రియ, కరిష్మా, జెస్సికా, చందు, లిఖిత పాల్గొన్నారు.

డీఏ బకాయిల విడుదలకు డిమాండ్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ఉద్యోగులకు డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ డీఏ బకాయిలపై హైకోర్టులో ప్రభుత్వంపై కేసు వేసినట్లు వెల్లడించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు.

కావడి మొక్కులు చెల్లించిన మాజీ మంత్రి రోజా

- సుబ్రమణ్య స్వామికి వెండి శూలాయుధం సమర్పణ





హుండీలో వేయడానికి తెచ్చిన వెండి శూలాయుధంతో మాజీ మంత్రి రోజా, కావడితో కొండకు వస్తున్న రోజా

నగరి : ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మాజీ మంత్రి ఆర్కేరోజా కావడి మొక్కులు చెల్లించారు. సంప్రదాయ పద్ధతిలో పసుపుచీర ధరించి సుబ్రమణ్యస్వామి వ్రతమాచరించిన ఆమె పుష్పాలతో అలంకరించిన కావడి ఎత్తారు. రాష్ట్ర సరిహద్దులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుత్తణి సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.తర్వాత మొక్కుబడిలో భాగంగా వెండి శూలాయుధాన్ని హుండీలో వేసి మొక్కు చెల్లించుకున్నారు. ఆమెను ఆలయ పురోహితులు ఆశీర్వదించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, నాయకులు రమేష్‌రెడ్డి, మురుగ, ఆనంద్ కుమార్, కృష్ణమూర్తి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు ప్రశంసలు



టీటీడీ అధికారుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు



పురస్కారం అందుకుంటున్న సీఐ రాంకిషోర్

తిరుపతి అన్నమయ్యసర్కిల్: ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ మేరకు అవార్డు గ్రహీతలను శనివారం పలువురు అభినందించారు. అందులో భాగంగా టీటీడీ సీపీఆర్‌ఓ విభాగం సీనియర్ అసిస్టెంట్ టి.శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతులమీదుగా పురస్కారం అందుకున్న అలిపిరి సీఐ రాంకిషోర్‌ను అభినందించారు.

అంబరం.. ‘అష్టమి’ సంబరం!

- కనులపండువగా కృష్ణాష్టమి వేడుకలు
- ఇస్కాన్ మందిరంలో విశేష పూజలు
- భగవానుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ద్వారకా నగర్‌లో..



ఇస్కాన్ మందిరంలో రాధాగోవిందులు, అష్టసఖుల వైభవం

తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణ భగవానుని జన్మాష్టమి వేడుకలను శనివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఇస్కాన్ మందిరాలు, కృష్ణ మందిరాలలో శ్రీరాధాగోవిందులను భక్తితో పూజించి పులకించారు. ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో వెలసిన ఇస్కాన్ మందిరంలో వేడుకగా శ్రీకృష్ణ జన్మాష్టమి జరుపుకున్నారు. ఉదయం 4.30 గంటలకు సమర్పించిన మంగళహారతి, తులసి పూజ,నరసింహ కీర్తన జపంతో వేడుకలు ఆరంభమయ్యాయి. అనంతరం మందిరంలోని ప్రత్యేక సెట్టింగ్స్‌పై రాధాగోవిందులను కొలువుదీర్చారు. అష్టసఖులను విశేష పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఆలయం వద్ద ప్రత్యేకంగా క్యూలు ఏర్పాటు చేశారు. చిన్నికృష్ణుడు,రాధ,రుక్మిణి,యశోద వివిధ దేవతామూర్తుల వేషధారణలతో ఇస్కాన్ మందిరంలో పిల్లలు సందడి చేశారు. భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు.

ఉత్సాహంగా ఉట్లోత్సవం

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఇస్కాన్ మందిరం ఎదురుగానున్న టీటీడీ మైదానంలో శనివారం సాయంత్రం ఉట్లోత్సవం ఉత్సాహభరితంగా సాగింది. జనం కేరింతల నడుమ యువత ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. టీటీడీ క్వార్టర్స్‌కు చెందిన యువకులు విజేతలుగా నిలిచారు.

మహా శంఖాభిషేకం

ఇస్కాన్ మందిరంలో శనివారం రాత్రి 11 గంటలకు రాధాగోవిందుల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా మహా శంఖాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: ద్వారకా నగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగించారు.

తుమ్మలగుంటలో..

తిరుపతి రూరల్: తుమ్మల గుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయం వెలుపల వేద పాఠశాల విద్యార్థులు ఉట్టి కొట్టి అందరినీ అలరించారు.

పాకాలలో..

పాకాల : మండలంలోని చెన్నుగారిపల్లెలో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ సభ్యులు టి.జయరామనాయుడు సహకారంతో కృష్ణ మందిరానికి రూ.15వేల విలువైన బీరువాను వితరణ చేశారు.



చెన్నుగారిపల్లెలో..





తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం ఎదుట ఉట్టి కొడుతూ వేద విద్యార్థుల సందడి



బీరువాను బహూకరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారం



విద్యార్థులతో అతిథులు, ఉపాధ్యాయులు

తిరుపతి తుడా : తంబవానికుంట ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి పరీక్షలకు సంబంధించి ఉత్తమ మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. పిల్లలకు నగదు ప్రోత్సాహకంతోపాటు జ్ఞాపికలను బహూకరించారు. హెచ్‌ఎంలు సుజాత, ప్రవీణ్, ఎస్‌ఎంసీ చైర్మన్ కదిరి రాజేంద్ర, కో-ఆర్డినేషన్ సభ్యులు జి.మునిరత్నం, మనీష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.